# పని - మనుషులు

- శ్రీవిరించి




ఆటోరిక్షా ఆసుపత్రి ముందు ఆగింది.

వాచస్పతి దిగబోయాడు. "ఆగండి" అంది కస్తూరి.

ఎందుకు - అన్నట్లు ఆమె వంక చూశాడు.

"ముందు నేను దిగి మీకు చేయి అందిస్తాను" అంది దిగుతూనే కస్తూరి.

"అక్కర్లేదు. కస్తూరి నేను దిగగలను" అంటూనే వాచస్పతి ముందుకు కదిలాడు. అప్పటికే కస్తూరి రోడ్డు మీదకు వచ్చింది. చెయ్యి చాచి వాచస్పతి భుజం మీద ఆన్చింది. "ముందు కుడికాలుతో దిగండి" అంది.

అతనికి నవ్వు వచ్చింది. ఏమిటీ ఈ జాగ్రత్తలన్నీ! జరగవలసింది ఏదో జరిగిపోయింది. ఇప్పుడు ఏం చేసినా అంతా పోస్టుమార్టమ్. అయినా అతను కుడి కాలుతో తప్ప మరో రకంగా కిందకు దిగే అవకాశమే లేదు.

వాచస్పతి రోడ్డు మీదకు దిగి నిలిచాక, "ఒక్క నిముషం నిదానంగా నిల్చోండి" అంది కస్తూరి.

ఆటోరిక్షా అతను మీటర్ వంక చూస్తూ పైసలు చేతిలో పెడితే చాలు, ఇంక వరుగు తీస్తాను అన్నట్లుగా ముఖం పెట్టాడు.

"ఆటోను ఉండమందాం. ఎందుకయినా మంచిది" అంది కస్తూరి.

"అవసరం లేదు. బోలెడన్ని దొరుకుతాయి. అయినా ఎంతసేపు వెయిట్ చేయవలసి వస్తుందో?" అన్నాడు వాచస్పతి.

కస్తూరి ఇంకేమీ రెట్టించలేదు.

మీటర్ వంక చూసి డ్రైవర్‌కు డబ్బు అందించింది.

"డాక్టర్‌గారు త్వరగా చూసి పంపిస్తే బాగుండును. అసలే నించోలేకుండా ఉన్నారు మీరు" అంది కస్తూరి లోపలకు నడుస్తూ.

కాస్తంత విషయాన్ని గంపంత చేస్తోంది అనుకున్నాడు వాచస్పతి.

అసలు ఆసుపత్రికి రావడమే అనవసరం.

కాదంటే ఇల్లు పీకి పందిరి వేస్తుందని, రోజంతా ఇదే విషయం సాధిస్తూ కూర్చుంటుందని, ఒకవేళ 'గ్రహచారం' చాలక సెప్టిక్ అవడమే జరిగితే ప్రమాదం కదా అని తానూ నోరు మెదపకుండా వస్తున్నాడు.

స్ప్రింగ్ డోర్ తెరచుకుని ముందుకు అడుగులు వేశాడు.

చిన్న హాలు, అయిదారు కుర్చీలు వేసి ఉన్నాయి. అన్నిటిలోనూ మనుషులు కూర్చుని ఉన్నారు. ఓ మూల ఓ చిన్న కుర్చీమాత్రం ఖాళీగా ఉంది.

నిజానికి అది ఈ హాలులో ఉండవలసిన కుర్చీ కాదు. అవసరార్థంగా వేసినట్టున్నారు ఎవరో.

నిండిపోయిన కుర్చీలవంక నిట్టూరుస్తూ చూసింది కస్తూరి.

ఎట్లా నించుని ఉంటారు, ఈ మనుషులందరూ వెళ్లిపోయేంత వరకు?

తాము హాల్లోకి రాగానే ఎవరైనా గౌరవపురస్సరంగా లేచి ఇద్దరికీ సీట్లు ఆఫర్ చేస్తే బాగుండును - అని ఉంది కస్తూరికి.

అయినా ఆసుపత్రి వెయిటింగ్ హాలులో అంతటి ధర్మాత్ములు, పుణ్యాత్ములు ఎందుకు ఉంటారు? ఎవరి తొందర వారిదే కదా! పైగా తమను ఈ మహానగరంలో ఎవరూ ఎరుగరు. ఈ ఊరు వచ్చి ఇంకా మూడు నెలలయినా కాలేదు.

"ఆ మూల కుర్చీలో కూచోండి" అంది వాచస్పతితో.

సన్నగా పీలగా ఉంటాడు అతను. ఎంత చిన్న కుర్చీ అయినా సరిపోతుంది. ఆ కాలుతో నించుని ఉండడం కంటే ఎలాగో కూర్చోవడం మంచిది.

కస్తూరి బాగా లావుగా ఉంటుంది. ఆమెకయితే ఆ కుర్చీ చాలదు. మామూలు కుర్చీలే అంతంతమాత్రం.

ఒక కుర్చీలో బొత్తిగా మైనరు కుర్రాడు కూర్చుని ఉన్నాడు. పక్క కుర్చీలో ఉన్నది వాడి తల్లో, అక్కగారో అయి ఉంటుంది. తల్లే కావచ్చును. 'పాపం పెద్దవాడు వచ్చాడు. ఆయనకు కుర్చీ ఇవ్వు. నువ్వు లేచి నుంచో' అని చెప్పవద్దూ ఆమె ఆ కుర్రవాడితో- అనిపించింది కస్తూరికి.

ఎందుకు చెబుతుంది? నా కంటే లావుగా ఉంది అనుకుంది కస్తూరి. మనుషులు లావుగా ఉండటానికీ, గర్వమూ, అతిశయమూ ఉండటానికి దగ్గర సంబంధం ఉన్నదని ఆమె నమ్మకం.



"అదేం చిత్రమోగానీ! నువ్వు సెలక్ట్‌చేసిన చీర మా ఆవిడకి ఇట్టే నచ్చి పోయిందనుకో" సంబరంగా అన్నాడు వీరభద్రం, పక్కింటి సుబ్బారావుతో.

"ఆ! ఏముందిలే! నీ పెళ్ళికి ముందు చాలా సాయంత్రాలు షాపింగ్‌తోనే చవ్వగా గడిపేసే దోయ్" అని నాలుక్కరుచుకున్నాడు సుబ్బారావు.

కె.వి. రాందాస్, బరంపురం

ఇంతలో లోపలి స్ప్రింగ్ డోర్ తెరచుకుని ఒక ముసలాయన- అంటే మరీ పండుముసలి కాదు. జుట్టంతా తెల్లగా ముగ్గుబుట్టలా అయిపోయింది గాని, వయసు యాభై అయిదు, ఆరు కంటె ఎక్కువ ఉండదు- బయటకు వచ్చాడు.

తలుపు సందుల్లోంచి ఆయన ముఖం కనిపించీ కనిపించకముందే మైనరు కుర్రవాడు, అతని పక్కన కూర్చున్న లావాటి ఆవిడ కుర్చీల్లోంచి లేచారు.

"రండి, రండి" అంది కస్తూరి. వినురుగా రెండు కుర్చీలు ఆకట్టేసుకుంటూ. వీటికి ఇంకెవరూ కాంపిటీటర్స్ లేరని తెలిసినా ఆమె తొందరపాటు పడకుండా ఉండలేకపోయింది.

కస్తూరి, వాచస్పతి రెండు కుర్చీలలో సుఖాసీనులయ్యారు.

"ఆ కాలు మీద ఎక్కువ బరువు ఆన్చకండి. మీకు అసలే మతిమరుపు" అంది కస్తూరి.

వాచస్పతి పాంట్ మడతలు పైకి తీశాడు. మరో రెండు, మూడు మడతలు మడిచాడు. ఎడమ కాలు - పిక్క - సగం వరకు గాలిపోసుకుందుకు బయటకు వచ్చేసింది. పిక్కకు నీలంరంగు గుడ్డ కట్టి ఉంది. ఆ గుడ్డ అంచుల్లోంచి పసుపురంగు చర్మాన్ని అంటుకుని పైకి ఉబ్బి కనిపిస్తోంది.

"ఏమయిందమ్మా కాలుకు?" అనడిగారు ఎవరో!

కస్తూరి ఆ ప్రశ్న వచ్చినవైపు తల తిప్పి చూసింది. వనిలో వనిగా లోపల ఉన్న అయిదారుగురినీ పరిశీలనగా చూసింది. అందరూ ఆడవాళ్లే, వాచస్పతి తప్ప.

"మొన్న ఆఫీసు నుంచి వస్తూంటే -" అంటూ మొదలు పెట్టింది కస్తూరి.

"క్లుప్తంగా చెప్పు చాలు" అన్నాడు వాచస్పతి ఆమె చెవిలో.

'అలాగేలెండి' అన్నట్లుగా అతని భుజం తాకింది కస్తూరి.

"మన దారిన మనం పోతున్నా, రిక్షావాళ్లూ, స్కూటర్ వాళ్లూ మనను అట్లా పోనివ్వరు ఈ రోజుల్లో" అంది ఇంకో ఆమె.

"పేవ్‌మెంట్ మీదనే నడుస్తున్నారు. కారు, స్కూటరు కాదులెండి కారణం" అంది కస్తూరి. అది కారణం కాకపోవడం ఆమెకు చాలా విచారకరంగా ఉంది; ఆమె గొంతు వింటూ ఉంటే.

"మరేమయింది?"

"సైకిల్ మీద వస్తున్న మనిషి పక్కనుంచి వచ్చి పడగొట్టాడా?" అంది మరో ఆవిడ.

"కాదండీ- మరేం అయిందంటే!"

వాచస్పతికి ఎంబరాసింగ్‌గా ఉంది ఈ ధోరణి అంత. ఏమయితే ఎందుకు వీళ్లకు! యక్షప్రశ్నలు.

కస్తూరి అయినా ఏదీ ఒక్క మాటలో చెప్పి వేయకుండా ఊరికే నానుస్తుంది ఎందుకు?

"నీరసంగా ఉంది. సోషవచ్చి పడిపోయినారా ఏమిటి కొంపదీసి!"

"కాదండీ... నాకూ సరిగా తెలీదు. ఆయన స్పష్టంగా చెప్పలేకపోతున్నారు ఏమయిందో? ఒక సందు మలుపు తిరుగుతూ ఉంటే ఎదురుగుండా ఓ బర్రె పరుగెత్తుకుంటూ వచ్చిందట!"

"అమ్మో... అమ్మో! ఎంత పని జరిగింది. ఆ బర్రెకు నిడుపాటి సూటికొమ్ములు లేవు గదా!"

"బర్రె వెనకాలే దూడకూడా వచ్చిందట. రెండూ ఆయన పక్కనుంచి దూసుకుపోయినాయట. ఆయన్ను ఏమీ చేయలేదు, అంటారు మరి! కాలిమీద మాత్రం ఒక అడుగు పొడుగు రక్తపుచార, గాయం. అలా నెత్తురు కారుతూనే ఇంటికి వచ్చారు"

"ఓ అడుగు పొడుగే!" అంది ఆశ్చర్యపోయి మొదట ప్రశ్న వేసిన ఆవిడ.

- ఇదంతా జరిగినందుకు కాకుండా నలుగురికీ చెప్పుకోవలసి వచ్చినందుకు చాలా సిగ్గుగా ఉంది వాచస్పతికి.

కస్తూరికి మాత్రం నిన్నటి నుంచి ఈ సంఘటనను చిలువలు పలువలు అల్లి, పల్లవులు చరణాలు చేర్చి కనిపించిన అందరికీ చెప్పుకుంటూపోవడం ఎంతో ఆనందంగా ఉన్నట్టుంది.

ఏదో ఏక్సిడెంట్ అయి ఎముకలు విరిగి కాలికంతా ప్లాస్టర్ వేసి ఆరువారాల దాకా పక్కలోనే పడుకుని ఉండవలసి రానందుకు ఒపక్క సంతోషంగానే ఉంది.

మరోపక్క బర్రె, దాని దారిన అది - పేవ్‌మెంట్ మీదనే అయితే మటుకేం? పోతూ ఉంటే భయపడి పోయి కిందపడి రోడ్డు పక్కనే ఉన్న ఏ సూదంటుకొన రాయికో గుచ్చుకుని కాస్తంత గీరుకుపోయినంతమాత్రాన ఇంత హంగామా చేస్తున్నందుకు సిగ్గుగానూ, పరితాపంగానూ ఉంది.

ఇంటికి వచ్చిన తర్వాత కస్తూరి చేసిన హంగామా అంతా ఇంతా కాదు. వెంటనే డాక్టర్ని పిలిపిస్తానంది. గాయానికి ఏదయినా ఆయింట్‌మెంట్ అద్దితే చాలు. ఏమంత లోతయిన గాయం కాదు - అని ఎంతోసేపు చెబితే అప్పుడు ఊరుకుంది.

మరునాడు కాలు కాస్త వాచిన మాట వాస్తవమే.

ఆఫీసుకు పోకుండా సెలవుపెట్టి కూర్చున్నాడు.

ఆఫీసు ఎటెండర్ ఇంటికి వచ్చినప్పుడు చూసి 'ఏమీ లేదు' అన్నాడు. కాకపోతే మరికాస్త ఫస్ట్ ఎయిడ్ లాగ చేసి బిగించి కట్టు కట్టాడు. అందుకు ఆసుపత్రికి వెళ్లకుండా సరిపోయింది.

'కాలు నెప్పిగా ఉందా లేదా చెప్పండి' అంది కస్తూరి. గుచ్చిగుచ్చి అడుగుతూ ఉంటే అవుననీ కాదనీ చెప్పడం కష్టమయిపోయి చాలాసేపు బాధపడ్డాడు వాచస్పతి.

ఈ వేళ ఉదయం ఏమయినాసరే డాక్టరుకు చూపించవలసిందే, నాలుగైదు ఇంజక్షన్లు తీసుకోవలసిందే- అని బలవంతం చేసింది కస్తూరి.

'డాక్టర్‌గారు ఏం చెబితే అది చేద్దాం. నాలుగయిదు ఇంజక్షన్లు యివ్వమని నువ్వు మాత్రం ఆయనకు రికమెండ్ చేయకు– 'అన్నాడు వాచస్పతి. ఇంజక్షన్లంటే భయం వల్ల కాదు, కస్తూరి అతితెలివి వల్ల ఇద్దరూ నవ్వులపాలు అవుతారేమోనని.

'ఈ ఊరికి కొత్తగా వచ్చారా?' అంది ఒకామె. ఆమె కంఠంలో ఎంతో సానుభూతి, అణుకువ కనిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన వాళ్ళను ఇక్కడి బత్తెలు కూడా భయపెడతాయి సుమా- అన్న హెచ్చరిక వినిపించింది వాచస్పతికి.

'అవునండీ', అంటూ ప్రవరీ మొదలుపెట్టింది కస్తూరి. ఎక్కడినుంచి వచ్చిందీ, ఎందుకు వచ్చిందీ, మళ్లీ ఎన్నాళ్లకు బదిలీ అయిపోయేది... ఆయన ఈ ఉద్యోగంలో ఎంత అనుభవం గడించిందీ... అంతా చెప్పుకుపోయింది. వాచస్పతి ఎన్నో సైగలు చేసి కూడా ఆమెను వారించలేకపోయాడు. కస్తూరి తాను చెప్పవలసిందంతా అయిపోయిన తర్వాత, 'ఇక్కడ ఎక్కువ మందికి కలర్ టెలివిజన్లు వున్నట్లు లేవు' అంది.

'లేకేమండీ, బ్లాక్ అండ్ వైట్ తీసుకుని కలర్ టీవీలు ఇచ్చే కంపెనీలు పెద్ద బజార్లో నాలుగు వున్నాయి. ఆ నాలుగింటిలోకీ మాదే పెద్దది సుమండీ. మీకు అవసరం అయితే–'

'అబ్బే. అవసరం లేదండీ. మాది కలర్ టి.వి.యే. బ్లాక్ అండ్ వైట్ మార్చుకోలేదు మేం. మావారి దగ్గర పనిచేసే ఒకాయనకు బహుమతిగా ఇచ్చేశాం' అంది కస్తూరి.

వాచస్పతి మనసులోనే విసుక్కుంటున్నాడు. కస్తూరి యింకా ఏం లేనిపోని మాటలు పెంచుతుందోనని. ఆయన దగ్గర బహుమతిగా నాలుగు వేలు తీసుకున్నామని కస్తూరికి తెలియక కాదు.

'మీకు మంచి చీరలు కావాలంటే, ఈ వూళ్లో వున్నన్ని రోజులూ మా దుకాణానికే రావాలి' అంది మరో ఆమె.

'నేను సాధారణంగా ఇండియాలో చీరలు కొననండి. మావారు సింగపూరు వెళ్లినపుడు ఓ పాతిక, ముప్పై తెచ్చిపడేస్తారు. అవే ఎక్కి తొక్కి అయిపోతాయి. మా ఆడబడుచులకూ ఇచ్చెయ్యవలసి వస్తుంది కూడాను–' అంది కస్తూరి.

వాచస్పతి ఇరుకుగా అటు ఇటు చూశాడు.

మరో కుర్చీ కాళీ అయింది.

ఇంకో మూడుమార్లు ఈ పని జరిగితే తప్ప తమ 'టర్న్' రాదు. కాలునెప్పి ఏం లేదుగాని, తొందరగా ఇంటికి వెళ్లిపోదాం- అని వుంది అతనికి. 'మీకు వాషింగ్ మెషీన్ వుందండి? ఇండియాదా- ఇంపోర్టెడా?-' అని అడిగింది ఒకామె, కస్తూరిని నేరుగా. కస్తూరి ఆమె వంక చురచురా చూచింది.

'ఎందుకండీ వాషింగ్‌మెషీన్?'

'అదేమిటండీ, అలా అడుగుతారు? లాండ్రీ బిల్లులు తప్పుతాయి. బట్టలు మన్నిక బాగా వస్తాయి. మెషీన్ మన యింట్లోనే వుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు దుస్తులు సిద్ధం చేసుకోవచ్చుగదా!'

ఈమె బహుశ ఆ కంపెనీకి ఏజెంటో, అమ్మకందారో అయి వుండాలని తీర్మానించుకుంది కస్తూరి. బట్టలు ఉతకడం అంటేను, ఆరవేయడం అంటేను, మడతలు పెట్టి బీరువాలో దాచుకోవడం అంటేనూ ఆమెకు ఉన్న అసహ్యం అంతా కళ్ళల్లోను, ముఖంలోను వ్యక్తం చేస్తూ 'ఆ మిషన్ల సంగతి నాకు చెప్పకండి' అంది.

'అదేమిటండీ. అలా అంటారు?'

'అమ్మా మీకు ఇండియన్ ఎకానమీ బాగా తెలిసినట్లు లేదు. మనదేశంలో పనిమనుషులు అతి చౌక. ఇంకా కావాలంటే కారుచౌక. నెలకో యాభై రూపాయలు పారేస్తే పొద్దున్న నుంచి సాయంకాలం దాక చెప్పిన పనీ, చెప్పని పనీ చేసిపెట్టే మనుషులు ఇంకా- మీ ధర్మమా అని- కో అంటే కోటి మంది. అందుచేత బట్టలు ఉతకటానికి, మిషన్ కొనడం శుద్ధ దండగ మారి పని అని నేను ఎప్పుడో నిర్ధారించుకున్నాను. నన్ను మీరు బోల్తా కొట్టించలేరు-' అంది కస్తూరి ధీమాగా.

'పోనీలెండి. ఎవరి అభిప్రాయాలు వాళ్లవి' అని ఆమె సర్దిచెప్పింది. వాచస్పతి కాస్త స్థిమితపడ్డాడు.

పనిమనిషికి నూట యాభయి రూపాయలు యిస్తున్న సంగతి అతనికి తెలుసు. అయినా ఆ మనిషి 'నేను వెళ్లిపోతాను. ఇంత పని నా వల్ల కాదు,' అని వారానికి రెండుమార్లయినా బెదిరిస్తున్న సంగతి కూడా తెలుసు.

కస్తూరి ఎందుకు యిట్లా దబాయించి మాట్లాడుతోంది? ఎంత ధైర్యం! డబ్బు పారేస్తే ఎలాంటి పనయినా ఎవరిచేతనయినా చేయించవచ్చును- అనే అభిప్రాయం నుంచి కస్తూరిని మళ్లించడం ఎలాగో అతనికి ఎప్పుడూ అర్థం కాదు.

పనిమనుషులంటే అంత తేలిక భావం ఎందుకని?

వాళ్లేం మనకు అడుగులకు మడుగులు ఒత్తే బానిసలా? డిగ్నిటీ ఆఫ్ లేబర్- ఈ మనిషికి ఎప్పటికి తెలిసివస్తుంది?

డాక్టర్ దగ్గరకు వెళ్లే 'టర్న్' రానే వచ్చింది.

కస్తూరి మళ్లీ కథంతా ఆయనకు చెప్పింది. ఆయన తన పని చూచుకుంటూనే వాచస్పతి కాలు గాయం కడిగి డ్రెస్ చేస్తూనె అంతా వింటున్నట్లు నటిస్తున్నాడు.

ఆరు టాబ్లెట్లు కూడా యిచ్చాడు.

'మూడురోజులు అయినాక మళ్లీ రండి' అన్నాడు.

డాక్టర్ దగ్గర్నుంచి బయటకు రావలసిన సమయం వచ్చేసినప్పుడు కూడా కస్తూరికి ఆయన యింకా శ్రద్ధగా, జాగ్రత్తగా విని, చూస్తే బాగుండేది- అనిపించింది.

'మరేం ప్రమాదం లేదు గదా డాక్టర్‌గారూ?' అని అడిగేసింది ఆపుకోలేక.

'ప్రమాదమా? అబ్బే ఏం లేదండీ, మూడోనాటికి గాయం మచ్చలేకుండా మాయమైపోతుంది.'

'చాలా థాక్సండీ' అంటూ ఇద్దరూ బయటకు వచ్చారు.

బయటకు వచ్చేశాక కస్తూరి నిదానంగా అడిగింది వాచస్పతిని- 'ఫరవాలేదంటారా?– లేకపోతే మరో డాక్టర్ దగ్గరకు వెళ్లి సెకండ్ ఒపీనియన్ తీసుకుందామా?' అని.

వాచస్పతికి నవ్వు వచ్చింది.

పైకి నవ్వితే ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకోవలసివస్తుంది గనుక తమాయించుకున్నాడు.

'మూడురోజుల తర్వాత ఆలోచిద్దాం' అన్నాడు పైకి. కాని అతని ఆలోచనలన్నీ కస్తూరి గురించే.

కస్తూరికి యింత తేలిక భావం ఎందుకని?

పని-మనిషి – ఈ రెండూ ఆమెకు అంత విలువయినవిగా ఎందుకు కనిపించవు?

పనిమనుషులంటే అంత తేలిక భావం ఎందుకని కస్తూరికి?

పదిహేను సంవత్సరాల క్రితం- తాను పెళ్లి చేసుకోక ముందు, కస్తూరి స్టేటస్ యేమిటి? పనిమనిషే గదా!

ఆ స్టాటస్‌కు విలువ యివ్వబట్టేగదా, ఇప్పుడు యిలా ఇల్లాలయి పనిమనుషుల గురించి తేలికగా మాట్లాడుతుంది!

అయినా 'పని'ని గురించి ఆమెకు వున్న అభిప్రాయాలు తప్ప, ఇంకే విషయంలోను ఇద్దరికీ వైమనస్యం లేదు గనుక రోజులు సజావుగా గడిచిపోతున్నాయి.

కస్తూరి వయసుకు మించి లావు అయినా వాచస్పతి వేళాకోళం చేయకుండా కాలక్షేపం చేస్తున్నాడు.

'ఏమీ తినకపోయినా నేను లావెక్కిపోతున్నాను. ఎంత జాగ్రత్తగా చూచుకుంటున్నా, మీరు మాత్రం రోజురోజుకూ పీలగా తయారవుతున్నారు. కాస్త లావు అవటానికి ఏమయినా గట్టి మందులు రాయమని అడుగుతాను. డాక్టరుగారిని ఈమారు వచ్చినప్పుడు యేం?' అంది కస్తూరి, ఆటోలో చేరాక.

'అలాగేలే, అని యథాలాపంగా అనడం అయితే అన్నాడు గాని వాచస్పతి, పనిమనుషుల్ని గురించి కస్తూరి ఎందుకంత తేలిక అభిప్రాయం యేర్పరుచుకుందో ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు.

* * *



"పిన్నిగారూ! మీ వారు రైటరట! ఏ పత్రికాఫీసులో నేంటి?" అని ప్రశ్నించింది పక్కింటి పంకజం.
"పత్రికాఫీసులో కాదొదినా! పోలీస్ స్టేషన్‌లో!" అని బదులిచ్చింది మీనాక్షమ్మ.

శ్రీగిరి శ్రీకాంత్, అమలాపురం